# హంతకుడు

ముద్దాయి పక్షాన వాదిస్తున్న వకీలు వయస్సులో చిన్నవాడు. అదే అతని మొదటి కేసు కూడా. అత డీ విధంగా మాట్లాడాడు.

"న్యాయమూర్తులకు నేను విన్నవించేదేమంటే—ఈ కేసులోని సంగతులన్నీ నిజమని ఒప్పుకోవాలి. ముద్దాయి మర్యాదగల మనిషి. చేస్తున్న ఉద్యోగంలో వేలెత్తి చూపించుకోకుండా నడుచుకున్నవాడు. నెమ్మదీ, దయ, శాంతం కలవాడు. అటువంటి వాడు తాత్కాలిక కోపోద్రేకంవల్ల తన యజమానిని హత్యచేశాడు. అగమ్యగోచరంగా తోస్తుంది మనకీ విచిత్రం! ఇందులోని 'సైకాలజీ' నన్ను బోధపరచనిస్తారా? దేన్నీ దాచకుండా, దేన్నీ క్షమించకుండా బయలుపరుస్తాను. ఆ పిమ్మట మీరే తీర్పు చెప్పండి—

"జీన్-నికోలాస్ మర్యాదగల కుటుంబంలో పుట్టినవాడు. అతని తల్లిదండ్రులు మప్పితంగా, భయభక్తులతో అతన్ని పెంచారు.

"అక్కడే ఉన్నది అతని నేరం....భయభక్తులలో! ఇవి మనలో నశించాయి. ఈ మాటలు మాత్రం మిగిలి వాటిలోని అర్థం హరించుకుపోయింది. నిజమైన భయభక్తులు కనుక్కోవాలంటే పల్లెటూళ్ళలోని కొన్ని కుటుంబాలలో చూడాలి. అది మూఢవిశ్వాసమే అనండి. కాని ఆ భక్తికి తిరుగులేదు. దేన్నైనా నమ్మితే అందులో ఏమైనా దగా ఉంటుందేమో అనే అనుమానం కూడా లేదు.

"ఈ భయభక్తులు లేనివాడు పెద్దమనిషే కాడు. భయభక్తులున్నవాడు కళ్లు మూసుకుని సంచరిస్తాడు. అంటే అన్నీ నమ్ముతాడు. మనం మాత్రం కళ్లు వెడల్పుగా విప్పుకొని తిరుగుతాము. ఈ కోర్టు భవనం చూడండి. సంఘపు కుళ్లు కాలువ కాదా యిది? సంఘంలోని చెత్త అంతా ఇక్కడే చేరుతుంది. అన్నిరకాల కథలూ మన చెవుల్లో పడక తప్పదు. అవినీతి, అత్యాచారం, క్రౌర్యం, ఒకటేమిటి—మనుష్యులలో పొడచూపే అన్ని దుర్గుణాలూ ఇక్కడ చర్చకు వస్తాయి. దుర్మార్గులందరినీ, మహారాజులు మొదలు పాత దొంగల వరకూ—మేము సమర్థించాలి. ప్రతి దోషినీ మీ యెదుట నిలిపి జాలితో, చిరునవ్వులతో, బూకరింపులతో వారి పక్షం వాదించాలి. కళ్ళారా వీటినన్నిటినీ చూస్తున్నప్పుడు మన మనస్సులతో భయభక్తులకు స్థానం మిగులుతుందా? సంఘంలో అత్యున్నతుల మనుకున్న వారి నుండి అడుగున పడిగిన నీచాతి నీచుల

దాకా ఈ అవినీతి ప్రవహిస్తున్నట్లు మనకు స్పష్టంగా తెలుసును. అన్నీ కుళ్లిపోతాయనీ, అన్నీ అమ్మకమై పోతాయనీ మనకు తెలుసును. ఉద్యోగాలు, పదవులు, గౌరవాలు అన్నింటినీ ధనం కొంటుంది. కాదా అవి బిరుదులకో, ఇతర ఆశలతో వశ్యమౌతాయి. ఇంకా సూక్ష్మంగా పోతే స్త్రీలకు వినిమయ మౌతాయి. నిజం, వీటిని కాదనలేము. కళ్లు మూసుకోలేము. అందరూ దొంగలే. అందరినీ అనుమానించాలి. కాని ప్రస్తుతపు ముద్దాయివలె ప్రపంచము తెలియని భయభక్తులకు బలికావడానికి సిద్ధపడిన వారిని చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది.

"న్యాయమూర్తులారా! మనమంతా గౌరవపరులమే కావచ్చును. ఎందువల్లనంటే మురికిని దగ్గరకు చేరనియ్యం. మంచి దుస్తులు ధరిస్తాం. దుష్కార్యాలంటే అసహ్యించుకుంటాం. మనకొక దర్పం, గర్వం ఉంటుంది. ఇదీ 'గౌరవం' అంటే మనకు తోచే అర్థం. కాని ఇతనికి వలె మనలో గౌరవం పట్ల ప్రచండమైన, ఆభిజాత్య పూర్వకమైన విశ్వాసం వుండదనుకుంటాను.

"ఇక యితని జీవిత కథ చెప్పుతున్నాను.

"అందరి పిల్లల వలెనే ఇతడూ పెరిగాడు. అంటే మనుష్యులు చేసే కార్యాలన్నీ మంచీ, చెడ్డా అనే రెండు తరగతులుగా భాగించవచ్చునని ఇతడూ నమ్ముకున్నాడు. పగలూ రాత్రీలాగే మంచీ, చెడ్డా స్పష్టంగా కనబడతాయి.

ఈ విధంగా పెరిగాడు యితను; భక్తితో విశ్వాసంతో యిరుకు మనస్సుతో.

"ఇరవై రెండో యేట పెళ్ళయింది. ఇతనిలాగే పెరిగింది ఇతని భార్య కూడా. అవే నమ్మకాలూ, అంతే పవిత్ర మనస్సు. వీరి దాంపత్యం ఆదర్శప్రాయంగా ఉండేది. వైమనస్యాలకేమి తావులేదు. యితడు తల్లిని ఒక దేవతలాగ చూచుకొనేవాడు. అట్టి మాతృప్రేమలోని ఒక భాగం ఇప్పుడు భార్యపట్ల కనబరచేవాడు. ఎట్టి మోసాన్నీ ఎరగని ప్రశాంత జీవితం ఆమెతో అనుభవించాడు. ఎవరినీ తాను మోసగించలేదు గనుక తన్నెవ్వరూ మోసం చెయ్యరని విశ్వసించాడు.

"వివాహానికి కొంతకాలం క్రితం లాంగ్లేగారి కంపెనీలో షరాబుగా ప్రవేశించాడితడు. ఇటీవల యితడు చంపినదీ లాంగ్లేనే.

"న్యాయమూర్తులు సాక్ష్యం బాగా పరిశీలించండి. ముద్దాయి సౌమ్య స్వభావం అందరూ ఒప్పుకున్నారు. చనిపోయిన వాని తమ్ముడూ, అతని వాటదారుడూ, కంపెనీలోని ఇతర ఉద్యోగులూ అందరూ! నమ్మకం, అడకువ, మర్యాద, పనిలో శ్రద్ధ, పని తప్పకపోవడం, అన్నీ ఇతని సుగుణాలు."

"ఇతని స్వభావాన్నిబట్టి అందరూ ఇతన్ని గౌరవించేవారు. అట్లే ఇతని భార్యను కూడా. అందరూ ఈ దంపతులను ఎన్నికచేసేవారు. ఇట్టి గౌరవం ఇతని కలవాటుగానూ, హక్కుగానూ మారిపోయింది.

"కొన్నాళ్ళ కితని భార్య టైఫాయిడ్ జ్వరం వచ్చి మరణించింది. అప్పుడతడు అగాధమైన విషాదం అనుభవించాడనడాని కేమీ సందేహం లేదు. కాని అంతా లోలో పలనే. గుండెలు బాదుకొని ఉద్రేకం ప్రకటించడ మతనికి తెలియదు. ముఖంలోని వైవర్ణ్యమూ, దృష్టిలోని మార్పు, గాయం ఎంత లోతుకి పోయిందో చూపించాయి.

"పిమ్మట, అతి స్వాభావికమైన సంఘటన ఒకటి జరిగింది. పది సంవత్స రాలు ఇతడు వివాహిత జీవనం అనుభవించాడు. పది సంవత్సరాలు నిరంతరం ఆడు దాని సాన్నిధ్యానికి అలవాటు పడ్డాడు. ఆమె చేసే ఉపచారాలూ, యింటికి రాగానే ఆమె పరిచితమైన కంఠధ్వనీ. ఆమె దుస్తులు చేసే మృదువైన చప్పుడూ, జీవిత వేదన ఉపసంహరించే ఆమె ప్రేమ ప్రదర్శనలూ అన్నిటికీ అలవాటు పడ్డాడు. అన్నీ తప్పనిసరి అయినవి. అందువల్ల ఏకాకి తనం దుర్భరమయిందతనికి. అంతులేని సాయంత్రాలు గడవడానికా దగ్గరనున్న మద్యశాలకు పోయేవాడు. ఒక్కగ్లాసు బీరు త్రాగి నిశ్చలంగా కూర్చుని ఒకదాని నొకటి వెంటాడే బిల్లియర్డు బంతులను తదేక దృష్టితో చూస్తూ, ఆటగాళ్ళ వాదనలు వింటూ, పొరుగు వ్యక్తుల సంభాషణలూ, ప్రక్కగదిలో అప్పుడప్పుడు నవ్వులూ వింటూ కూర్చునేవాడు. తరుచు కేవలం విసుగు వల్లా చిరాకువల్లా నిద్ర కూడా పోయేవాడు. కాని తనకు హృదయానికి హృదయమై శరీ రానికి శరీరమైన స్త్రీ హృదయమూ, స్త్రీ శరీరమూ ఆవశ్యకమైనాయి. అందువల్ల తనకే తెలియకుండా గల్లాపెట్టె దగ్గర కూర్చున్న యువతికి కొంచెం కొంచెం సమీపంగా కూర్చోడం మొదలు పెట్టాడు; ఆడుది మాత్రమే అన్న కారణంవల్ల ఆకర్షితు డయిపోయి.

"తర్వాత వారు మాటల్లో పడ్డారు. ప్రతి సాయంత్రం అక్కడకు పోయి ఆమెతో కాలం గడపడం అలవాటయిందనికి. ఆమె జాణ తనంగా, నవ్వులతో అతని చేత ఎక్కువగా తాగించి వ్యాపారం వృద్ధిచేసేది. కాని నానాటికీ ఇతడు మాత్రం ఆమె ఎవరో తెలియకపోయినా, ఆమె జీవితమేమిటో ఎరుగక పోయినా, ఆమె మాత్రమే తాను చూచిన ఆడుది కావడంవల్ల దృఢానుబంధం వహించాడు.

"ఇట్టి అమాయకుణ్ని లోబరుచుకుంటే చాలా లాభాలుంటాయని ఆ మనిషి కూడా గ్రహించింది. ఏం చేస్తే వీడు మనచేతిలో పడతాడా అని ఆలోచించింది. పెళ్ళి చేసుకోవడమే సులువయిన మార్గమని నిశ్చయించింది."

"సునాయాసంగా ఈ పని నెరవేర్చిందామె.

"ఇక నేను వేరే చెప్పనక్కరలేదు. పెళ్ళి అయిన దగ్గరనుండీ ఈమె విచ్చల విడిగా సిగ్గులజ్జలు వదలి ప్రవర్తించింది.

"స్త్రీ సహజమైన మాయదారితనంతో ఈమె మర్యాదగల భర్తను మోసగిస్తూనే ఆనందించేది. అతని తోడి గుమాస్తా లందరితోనూ పోయింది నమ్మండి. అందరి తోనూ! సాక్ష్యంగా ఉత్తరాలున్నాయి. అచిరకాలంలో ఊరంతా గుప్పుమన్నది. ఇట్టి విషయాలకు మామూలేగా. భర్తకు మాత్రం ఈ సంగతి తెలియలేదు.

"తుట్టతుదకీ కులట ధనాశచేత కావచ్చును, భర్త యజమానియొక్క కొడుకును వశపరుచుకుంది. ఆ కుర్రాడికి పంథొమ్మిదేళ్ళ వయస్సు. ఈమె మాయలలో పూర్తిగా పడిపోయాడు. ఇన్నాళ్ళూ అదేపోయిందని కళ్ళు మూసుకున్న లాంగ్లే తన కొడుకు పాడయిపోతూండడం కనిపెట్టి నొచ్చుకున్నాడు.

"కాని ఒక తప్పు చేశాడతడు. వెంటనే జాన్—నికొలాస్‌ని పిలిపించి కోప మంతా అతని ముందు వెళ్ళగక్కాడు.

"ఇక మరేమీ లేదు. చనిపోతూన్న లాంగ్లే నోటినుండి వెలువడ్డవీ, పోలీసు వుద్యోగి రికార్డుచేసినవీ నాలుగు మాటలు చదువుతున్నాను.

"నా కొడుకు నిన్ననే పదివేల ఫ్రాంకులు దాని కిచ్చినట్లు తెలిపి కోపం పట్టలేక పోయాను. జీన్-నికొలాస్ అంటే నా కెప్పుడూ గౌరవమే. అయినా అతని గుడ్డి తనమే ప్రమాదించింది.

"అతనికి కబురు పెట్టించాను. రాగానే, నీ వుద్యోగం తీసివెయ్యవలసి వచ్చిం దని చెప్పాను.

"ఎదురుగుండా కళవళపాటుతో నిలబడ్డాడు. అతని కేమీ అర్థం కాలేదు. కారణం చెప్పమని తీవ్రంగా అడిగాడు.

"నీకే అవమానం కాబట్టి నేను చెప్పనన్నాను. అంటే అతనిలోని ఏవో లోపాలు నేను చెప్పడం మానుకున్నాననుకొని ప్రార్థించాడు. గద్దించికూడా అడిగాడు.

"అప్పటికీ నేను మాట్లాడలేదు. శ్రుతిమించిపోయింది. నన్ను అవమానిస్తూ మాట్లాడాడు. తన్నుకోవడం దాకా వస్తుందేమో అనిపించింది.

"ఇంతలో ఒకమాట కష్టం కలిగించింది నాకు. ఇక సహించలేక నిజం అతని మొగం మీదకి విసిరివేశాను.

"కొన్ని క్షణాలదాకా చిత్రంగా చూసి నిలబడిపోయాడు. పిదప నా డెస్కు మీద రిజిస్టర్లు కత్తిరించే పొడుగాటి కత్తెర తియ్యడం చూశాను. ఎత్తిన చేతితో నా మీద విరుచుకుపడ్డాడు. నా గొంతుకలో రొమ్ముకు మీదుగా ఏదో దూరినట్లయింది. ఏ మాత్రం బాధనిపించకుండా.'

"న్యాయమూర్తులకు నేనేమీ ఇక చెప్పనక్కరలేదు. ఈ కేసులోని సంగతి సందర్భాలన్నీ యింతే. ఇవే యితణ్ని రక్షించగలవు. ప్రథమ భార్యను న్యాయంగా ఎట్టి భక్తితో విశ్వసించాడో అదే భక్తితో రెండో పెళ్ళాన్ని కూడా గుడ్డిగా నమ్మాడు"

కొంత చర్చ సాగిన తర్వాత ముద్దాయిని విడుదల చేశారు.

మూలం: Guy de Maupassant.

ముద్రణ: సూర్యప్రభ 1945 జూన్

Guy de Maupassant (1850—93) ఫ్రెంచి రచయిత. దాదాపు 300 కథానికలు రచించాడు. వాటిలో కొన్ని శైలి విషయంలోనూ, శిల్పం విషయం లోనూ మనస్సంబంధమైన వాస్తవికత విషయంలోనూ సాటిలేనివిగా పేరొందాయి. Boule de Suif, La Ficelle, Miss Harriet, The Necklace వంటివి. మొపాసాఁ నవలలు కూడా రచించాడు—une vie (1883), Bel Ami (1855). శ్రీశ్రీ దృష్టిలో మొపాసాఁ కథలు గీతాలను పోలి ఉంటాయి—"మహోన్మాదంలోని మహా కవిత్వం" వాటిలో ఉంటుంది. తన ముగ్గురి ఋషులలో మొపాసాఁను చేర్చుకొన్నది ఇందుచేతనే.